సాక్షి
కర్నూలు
శనివారం : 2 : సెప్టెంబర్ : 2023



ఉమ్మడి జిల్లాకు వర్ష సూచన

ఎమ్మిగనూరురూరల్: ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ నెల 6 వరకు చిరుజల్లులు కురిసే అవకాశం ఉన్నట్లు బనవాసి కేవీకే వాతావరణ విభాగం శాస్త్రవేత్త మహదేవయ్య ఒక ప్రకటనలో తెలిపారు.



శాస్త్రోక్తంగా ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబాదేవికి శుక్రవారం అర్చకులు శాస్త్రోక్తంగా ఊయల సేవ నిర్వహించారు. ఊయలలో స్వామి అమ్మవార్లను ఉంచి షోడశోపచార పూజలు చేపట్టారు.



సరిలేరు మీకెవ్వరూ..!

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఐదుగురు టీచర్లకు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు వరించాయి. వీరికి సెప్టెంబర్ 5న పురస్కారాలు ప్రదానం చేయనున్నారు. IIలో▸

న్యూస్‌రీల్

పశుసంవర్ధకశాఖలో ఇద్దరికి పదోన్నతి



జవహర్‌లాల్

కర్నూలు(అగ్రికల్చర్): పశుసంవర్ధకశాఖలో ఇద్దరు సూపరింటెండెంట్లకు గజిటెడ్ మేనేజర్లుగా పదోన్నతి లభించింది. జిల్లా పశుసంవర్ధకశాఖ కర్నూలు డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో సూపరింటెండెంట్ జవహర్‌లాల్‌కు గజిటెడ్ మేనేజర్‌గా పదోన్నతి లభించింది. ఈయన ఏపీఎన్‌జీవో అసోసియేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. పదోన్నతిపై విశాఖపట్టణంలోని స్ట్రైల్‌కు బదిలీ అయ్యారు. నంద్యాల జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి కార్యాలయ సూపరింటెండెంట్ నాగరాజు డిప్యూటేషన్‌పై కర్నూలు జిల్లాలో పనిచేస్తున్నారు. ఈయనకు కూడా గజిటెడ్ మేనేజర్‌గా పదోన్నతి లభించగా గుంటూరుకు బదిలీ చేశారు. అనారోగ్య కారణాలతో పదోన్నతి వద్దని రాతపూర్వకంగా చెప్పినట్లు తెలుస్తోంది.

ఉర్దూ వర్సిటీ పాలక మండలి ఏర్పాటు

కర్నూలు (న్యూసిటీ): డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయం పాలకమండలిని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఉన్నత విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి జె.శ్యామలరావు జీఓ ఎంఎస్ నంబర్ 79 ను జారీ చేశారు. పాలక మండలి సభ్యులుగా విద్యావేత్త ఉస్మానియా కళాశాల కరస్పాండెంట్ అజ్రా జావీద్, పారిశ్రామి వేత్త ఎస్.నవీద్ పర్వేజ్, న్యాయవాది జి.ఎండీ.ఇబ్రహీంను నియమించినట్లు ఉర్దూ వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బాయినేని శ్రీనివాసులు శుక్రవారం విలేకరులకు తెలిపారు. వీరు మూడేళ్లపాటు పాలక మండలి సభ్యులుగా కొనసాగుతారని పేర్కొన్నారు.

గర్భిణులు, బాలింతల ఇళ్లకే పోషకాహారం

కర్నూలు(అగ్రికల్చర్): గర్భిణులు, బాలింతలకు ఆగస్టు 8 నుంచి టేక్ హోమ్ రేషన్(టీహెచ్‌ఆర్) పేరుతో ఇంటికే ప్రభుత్వం సరుకులు పంపుతోంది. సెప్టెంబర్ నెలకు సంబంధించి టేక్‌హోమ్ రేషన్‌కు శుక్రవారం శ్రీకారం చుట్టారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ దీనిపై సమీక్ష నిర్వహించి 15వ తేదీలోపు పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలోని 1,886 అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు 21,198 మంది, బాలింతలు 17,063 మంది ఉన్నారు. పోషకాహార లోపాలను నివారించేందుకు ఫోర్టిఫైడ్ రైస్ ఇస్తుండటం విశేషం. గర్భిణీ, బాలింతలకు ప్రతి నెలా 3కిలోల రైస్‌తో పాటు 25 గుడ్లు ఇస్తారు. గుడ్లు ఒకసారి 13, మరోసారి 12 అందజేస్తారు. వీటితో పాటు కందిపప్పు, ఆయిల్, రాగిపిండి, బెల్లం, వేరుశనగ చిక్కీలు, ఎండు ఖర్జూరాలు, పాలు, అటుకులు సరఫరా చేస్తారని ఐసీడీఎస్ పీడీ వెంకటలక్ష్మి తెలిపారు.



కరువు నేలపై కృష్ణమ్మ పరవళ్లు

కృష్ణగిరి సమీపంలో హంద్రీ-నీవా కాలువ

కృష్ణగిరి: హంద్రీ-నీవా కాలువ ఏర్పాటు చేసి నిత్యం కరువుతో అల్లాడుతున్న పత్తికొండ నియోజకవర్గానికి కృష్ణాజలాలు వచ్చే విధంగా వైఎస్సార్ కృషి చేశారు. కృష్ణగిరి, పందికోన రిజర్వాయర్లను ఏర్పాటు చేసి 70వేల ఎకరాలకు సాగునీరు అందించే దిశగా చర్యలు తీసుకున్నారు. గాజులదిన్నె ప్రాజెక్టు ద్వారా దేవనకొండ, తుగ్గలి, కృష్ణగిరి, డోన్ మండలంలోని 50 గ్రామాలకు, డోన్ పట్టణానికి తాగునీరు అందించారు. వైఎస్సార్ అడుగుజాడల్లో ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పయనిస్తున్నారు. హంద్రీ-నీవా కాలువ నుంచి 68 చెరువులకు నీరు మళ్లించే పనులు వేగవంతంగా జరుగుతున్నాయి.



చెరగని సంతకం.. చెదరని జ్ఞాపకం

- ప్రజల్లో వైఎస్సార్ జ్ఞాపకాలు పదిలం
- జిల్లాలో పరుగులు పెట్టిన అభివృద్ధి
- సాగునీటిప్రాజెక్టులకు పునర్జీవం
- ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పేదలకు ఉన్నత చదువులు
- నేడు దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి

వైఎస్సార్.. ప్రగతి స్వాప్నికుడు. సంక్షేమ రథసారథి. ఆయన పాలనలో అభివృద్ధి పరుగులు పెట్టింది. ఉచిత విద్యుత్‌తో వ్యవసాయం పండుగలా మారింది. ఆరోగ్యశ్రీతో పేదలకు కార్పొరేట్ వైద్యం అందింది. ఫీజురీయింబర్స్‌మెంట్‌తో బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ఉన్నత విద్య అందింది. వైఎస్సార్ పేరు వినగానే.. పేదలందరికీ పక్కా ఇళ్లు.. పావలావడ్డీ, రుణమాఫీ.. జలయజ్ఞం..ఇలా ఎన్నో పథకాలు గుర్తుకు వస్తాయి. తెలుగుదనానికి నిలువెత్తు రూపమైన వైఎస్సార్‌కు ప్రజలు గుండెల్లో గుడికట్టి పూజిస్తున్నారు. నేడు దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి. ఈ సందర్భంగా ప్రత్యేక కథనం..

– కర్నూలు(సెంట్రల్)

వరుస కరువులతో అల్లాడిపోతున్న ఆంధ్రప్రదేశ్‌ను 2004లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ అభివృద్ధి వైపు నడిపించారు. దేశంలోని అనేక రాష్ట్రాలు నివ్వెరపోయే విధంగా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేసి ప్రజల గుండెల్లో స్థిర స్థాయిగా నిలిచిపోయారు. జలయజ్ఞంలో పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులకు జీవం పోశారు. 1983 నుంచి పెండింగ్‌లో ఉన్న హంద్రీ-నీవా సుజల స్రవంతి మొదటి దశ పనులను రూ.2,800 కోట్లతో పూర్తి చేసి సంచలనం సృష్టించారు. గురురాఘవేంద్ర ఎత్తిపోతల పథకం కింద కృష్ణదొడ్డి, మునగాల, చింతమానుపల్లె, మాధవరం, నూగూరు పథకాలను పూర్తి చేశారు. ఇందు కోసం దాదాపు రూ.135 కోట్లు ఖర్చు చేశారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగులేటర్ సామర్థ్యాన్ని 13 వేల క్యూసెక్కుల నుంచి 44 వేల క్యూసెక్కులకు పెంచారు. సిద్ధాపురం, ముచ్చుమర్రి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. గుండ్రేవుల, నగరడోణ రిజర్వాయర్లకు సర్వే చేయించి అంచనాలు తయారు చేయించారు. ఎస్‌ఆర్‌బీసీ, గాలేరు-నగరి ఎత్తిపోతల పథకాలను చేపట్టారు. ముచ్చుమర్రి ఎత్తిపోథల పథకాన్ని చేపట్టి కృష్ణా, తుంగభద్ర నదుల అనుసంధానానికి చర్యలు తీసుకున్నారు.

- ➤ జిల్లాలో విద్యా సంస్థల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇచ్చారు. రాయలసీమ యూనివర్సిటీ ఏర్పాటుతోపాటు పదుల సంఖ్యలో బీటెక్, బీఈడీ, డీఈడీ కళాశాలల స్థాపనకు అనుమతులు ఇచ్చారు.
- ➤ ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించాలనే ఆకాంక్షతో ఫీజు రీయంబర్స్‌మెంట్ ప్రవేశపెట్టారు. వైఎస్సార్ హయాంలో కర్నూలు జిల్లాకు ప్రతి ఏటా రూ.50 కోట్లకు తగ్గకుండా ఫీజులు విడుదలయ్యేవి.
- ➤ జిల్లాలో మూడు విడతల్లో ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం కింద దాదాపు 35 వేల మందికి గృహాలు నిర్మించారు. పేదలందరికీ గృహాలు మంజూరు చేశారు.
- ➤ ఆరోగ్యశ్రీతో పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించారు. కర్నూలు జిల్లాలో వైఎస్సార్ హయాంలో 2 వేల మంది పేదలు గుండె ఆపరేషన్లను చేయించుకున్నట్లు వైద్యారోగ్యశాఖ రికార్డులు తెలుపుతున్నాయి. 108, 104 వాహనాలను ప్రవేశపెట్టి వైద్య సేవలను మెరుపరిచారు.
- ➤ విద్య, ఉద్యోగాల్లో ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లను కల్పించారు. దీంతో ఎంతో మంది ఇంజినీర్లు, డాక్టర్లు అయ్యారు. వేలాది మంది ఉద్యోగాలు సంపాదించారు.
- ➤ మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేశారు. జిల్లాలో రోజుకు దాదాపు లక్ష మంది కూలీలు పని కల్పించారు. దీంతో వైఎస్సార్ హయాంలో వలసలు తగ్గాయి.

హీరో అని పిలిచేవారు



1985లో పాణ్యం అసెంబ్లీ సీటు కోసం వైఎస్సార్‌ను కలిశాను. ఎన్నికలు అయి పోయిన తరువాత మొదటి సారి అసెంబ్లీకి వెళ్లి రాంభూపాల్‌రెడ్డి అని పరిచయం చేసుకున్నా. ఏం హీరో గెలిచివచ్చావా అని అప్యాయంగా పలకరించారు. అప్పటి నుంచి నేను కనబడిన ప్రతి సారీ హీరో అని పిలిచేవారు. రాయలసీమ సమస్యలపై వైఎస్సార్‌తోపాటు లేపాక్షి నుంచి పోతిరెడ్డిపాడు వరకు పాదయాత్ర చేశా. మహానేతతో కలసి పని చేయడం అదృష్టంగా భావిస్తున్నా.

– కాటసాని రాంభూపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే

వైఎస్సార్ ఆశయాలను కొనసాగిస్తున్న వైఎస్ జగన్



వైఎస్సార్ ఆశయ సాధన కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీని ఎదిరించి బయటకు వచ్చి ఎన్ని ఆటంకాలు ఎదురైనా పరిష్కరించుకుంటూ ముందుకెళ్తున్నారు. వైఎస్సార్ జ్ఞాపకాలు పదిలంగా ఉన్నాయి. వైఎస్సార్ జయంతిని జిల్లాలోని అన్ని నియోజవకర్గాల్లో ఘనంగా నిర్వహించేందుకు వైఎస్సార్‌సీపీ చర్యలు తీసుకుంటోంది. సేవా కార్యక్రమాల ద్వారా మహానేతకు ఘన నివాళి అర్పిస్తాం.

– బీవై రామయ్య, వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు, కర్నూలు నగర మేయర్

తరగని అభిమానం

కొత్తాళం: వైఎస్సార్ విగ్రహానికి తన సొంత ఖర్చుతో రంగు వేయించి అభిమానాన్ని చాటుకున్నాడు కొత్తాళం గ్రామానికి చెందిన దివ్యాంగుడు షేక్షావలి. గ్రామంలో ఉన్న విగ్రహం రంగు వెలసినట్లు షేక్షావలి గుర్తించాడు. శనివారం వైఎస్సార్ వర్ధంతి ఉండటంతో విగ్రహానికి రంగు వేయించి అభిమానాన్ని చాటుకున్నాడు. గతంలో తాను ఈ విగ్రహం కిందనే కూరగాయల వ్యాపారం చేశానని గుర్తు చేసుకున్నాడు. ప్రజల గుండెల్లో వైఎస్సార్ జీవించే ఉన్నాడని షేక్షావలి తెలిపారు.



పెను విషాదానికి 14 ఏళ్లు



చెల్లాచెదురుగా పడిన హెలికాప్టర్ శకలాలు (ఫైల్)

ఆత్మకూరు: ఏం జరిగిందో అనే ఉత్కంఠ.. ఎలాగైనా వస్తారనే ఆశ.. సరిగ్గా 14 ఏళ్ల క్రితం 2009 సెప్టెంబర్ 2వ తేదీన అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రయాణిస్తున్న హెలికాప్టర్ మిస్సయ్యిందన్న వార్త విన్న ప్రజలు తలా ఒక దిక్కుకు పయనమయ్యారు. తెలిసిన చోటల్లా వెదికారు. నల్లమల అడవిని జల్లెడ పట్టారు. చిత్తూరు జిల్లా అనుపల్లి గ్రామంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించేందుకు అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి బేగంపేట విమానాశ్రయం నుంచి 2009 సెప్టెంబర్ 2వ తేదీ ఉదయం 8.38 గంటలకు బెల్ 420 హెలికాప్టర్‌లో బయలు దేరారు. ఉదయం 10.30 గంటలు దాటినా హెలికాప్టర్ అనుపల్లికి చేరకపోవడంతో రాష్ట్ర ప్రజలందరిలో నరాలు తెగే ఉత్కంఠత ప్రారంభమైంది. ప్రభుత్వ యంత్రాంగం హెలికాప్టర్ ఆచూకీ కోసం ఐఏఎఫ్, ఆర్మీ, సీఆర్‌పీఎఫ్ బలగాలను రంగంలోకి దింపింది. హెలికాప్టర్ ఆత్మకూరు, పాములపాడు, కొత్తపల్లి, వెలుగోడు, గడివేముల ప్రాంతాలలో ఎక్కడో ఒక చోట ఉండవచ్చని గాలింపు చర్యలు ప్రారంభమయ్యాయి. కృష్ణానది, నల్లమల సమీపంలో సిగ్నల్స్ ఉన్నట్లు గుర్తించడంతో ప్రజలు, అధికారులు గుంపులు గుంపులుగా అరణ్య మార్గం వెంట బయలుదేరారు. ఎక్కడా జాడ కనిపించలేదు. రాత్రంతా నిరీక్షించిన తర్వాత 2009 సెప్టెంబర్ 3వ తేదీ ఉదయం నల్లమలలోని పావురాలగుట్టలో హెలికాప్టర్ కూలిన ఆనవాళ్లు గుర్తించారు. వైఎస్సార్ మృతి చెందిన చేదుజ్ఞాపకంగా పావురాలగుట్ట మిగిలిపోయింది.

వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నేడు సేవా కార్యక్రమాలు

వైఎస్సార్ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం ఉమ్మడి కర్నూలు జిల్లాలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అన్ని నియోజకవర్గాల్లో వైఎస్సార్‌కు నివాళి అర్పించడంతోపాటు అన్నదానం, రక్తదానం శిబిరాలను నిర్వహిస్తారు. ఆసుపత్రుల్లో రోగులకు పండ్లు, పాలు, బెడ్డు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. కర్నూలులోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఉదయం 9.30 గంటలకు పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారు. మేయర్ క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌కు నివాళి అర్పించిన అనంతరం నూతన లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేయనున్నారు.

గవర్నర్‌కు ఘన వీడ్కోలు

ఓర్వకల్లు: రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్‌కు శుక్రవారం ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఎయిర్‌పోర్టులో పలువురు రాజకీయ, అధికార ప్రముఖులు ఘనంగా వీడ్కోలు పలికారు. మంత్రాలయంలో నిర్వహించిన రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలకు రాష్ట్ర గవర్నర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. శుక్రవారం కర్నూలు ప్రభుత్వ అతిథి గృహం చేరుకుని అక్కడి నుంచి మధ్యాహ్నం 2.30 గంటలకు ఎయిర్ పోర్టుకు వచ్చారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రత్యే విమానంలో బెంగళూరుకు బయలుదేరి వెళ్లారు. ఎయిర్ పోర్టులో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎస్పీ కృష్ణకాంత్, నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, కర్నూలు మున్సిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, కర్నూలు ఆర్డీఓ హరిప్రసాద్, ఎయిర్ పోర్టు డైరెక్టర్ విద్యాసాగర్ గవర్నర్‌కు ఘనంగా వీడ్కోలు పలికారు.



గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో మాట్లాడుతున్న మంత్రి బుగ్గన, చిత్రంలో జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్సీ

రాయరు ఉత్సవం తేజోమయం

మంత్రాలయం: వేదభూమి మంత్రాలయంలో శుక్రవారం మధ్యారాధన వేడుకలు వైభవంగా నిర్వహించారు. రాఘవేంద్ర స్వామి సశరీరంగా బృందావన ప్రవేశం చేసిన శుభదినం కావడంతో వేడుకలు వెలుగులీనాయి. స్వర్ణ రథంపై శ్రీరాఘవేంద్రుడి బంగారు ప్రతిమను కొలువుంచి రథ యాత్ర నిర్వహించారు. ఆనవాయితీలో భాగంగా శ్రీరాఘవేంద్రస్వామికి తిరుమల తిరుపతి దేవస్థానం జేఈవో వీరబ్రహ్మేంద్ర పట్టు వస్త్రాలను సమర్పించారు. గజవాహనాధీశులైన ప్రహ్లాదరాయలకు శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు దివిటిగి సేవ నిర్వహించారు.

నేడు మహా రథోత్సవం

రాఘవేంద్రుల ఆరాధన సప్తరాత్రోత్సవాల్లో భాగంగా శనివారం ఉత్తరారాధన నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మంత్రాలయంలో రాఘవేంద్రుల మహా రథోత్సవం జరపనున్నారు. శ్రీమఠం నుంచి గ్రామ రాఘవేంద్రుల సర్కిల్ మీదుగా మళ్లీ శ్రీమఠం వరకు రథోత్సవం కొనసాగనుంది. ఈ ఏడాది కూడా రథంపై హెలికాప్టర్‌తో పూలవాన కురిపించేందుకు ఏర్పాట్లు చేశారు.



గజవాహన సేవలో పాల్గొన్న శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు

‘కొత్తగా’ రెక్కలొచ్చెనా!



నూతన పింఛన్ తీసుకున్న ఆనందంలో వృద్ధురాలు

ఉమ్మడి జిల్లాకు 11,085 కొత్త పింఛన్లు

- పెరిగిన పింఛన్లతో 4,59,343కు చేరిన లబ్ధిదారులు
- మరిన్ని కొత్త పింఛన్ల మంజూరుకు చురుగ్గా వెరిఫికేషన్
- పండుగ వాతావరణంలో పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో పింఛన్ల పంపిణీ పండుగ వాతావరణంలో సాగుతోంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కొత్త, పాత పింఛన్ల పంపిణీ శుక్రవారం ఉదయం నుంచే మొదలైంది. మొదటిసారి పింఛన్లు అందుకుంటున్న అవ్వతాతలు, దివ్యాంగులు, ఇతరుల ఆనందం అంబరాన్నంటింది. గ్రామ, వార్డు వలంటీర్లు ఉదయం 5 గంటల నుంచే పింఛనుదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ల పంపిణీ చేపట్టారు. తలుపు తట్టి మరీ పింఛను అందించడం పట్ల లబ్ధిదారులు ఉబ్బితబ్బిబ్బయ్యారు. ఎలాంటి రెకమండేషన్ లేకుండా, ఎవరికీ ఒక్క రూపాయి లంచం ఇవ్వకుండానే పింఛను మంజూరు కావడంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు చేతులెత్తి మొక్కుతున్నారు. కల్లూరు మండలం చిన్న టేకూరులో డీఆర్‌డీఏ-వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ నాగశివలీల, ఆదనపు పీడీ షరీఫ్ పింఛన్ల పంపిణీని పర్యవేక్షించారు. ఈ నెల 5వ తేదీ వరకు పింఛన్లు పంపిణీ చేయనున్నారు.

ఈ పింఛనే నా కుటుంబానికి ఆసరా



మాది నిరుపేద కుటుంబం. భార్య హేమలతతో కలిసి కూలి పనులతో జీవనం సాగిస్తున్నాం. మాకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం. ప్రమాదవశాత్తూ జరిగిన రోడ్డు ప్రమాదంలో కాళ్లు పోయాయి. ఆ తర్వాత కుటుంబ పోషణ భారమైంది. సదరం సర్టిఫికెట్ ఉండటంతో వలంటీర్ హనుమన్న సచివాలయంలో పింఛను దరఖాస్తు చేయించాడు. శుక్రవారం కొత్త పింఛను మంజూరైందని చెప్పి వలంటీర్ డబ్బు అందించారు. ఈ మొత్తం నా కుటుంబానికి ఎంతో ఆసర అవుతుంది.

– గొల్ల నాగరాజు, పోలకల్ గ్రామం, సి.బెళగల్ మండలం

కుటుంబ పోషణకు భరోసా



నాకు నాలుగు ఎకరాల పొలం ఉంది. మేకలను మేపుకుంటూ పొలం పనులతో భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలను పోషిస్తున్నా. రెండేళ్ల క్రితం బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో పక్షవాతం వచ్చి కోమాలోకి వెళ్లాను. కర్నూలు పెద్దాసుపత్రిలో చికిత్స తీసుకుని కోలుకున్నా. ఏడాదిపాటు ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా వైద్యం లభించింది. ఈ మధ్యనే సదరం క్యాంపునకు వెళ్లగా పరీక్షించిన వైద్యులు 90 శాతం వికలత్వం ఉన్నట్లు నిర్ధారించారు. సచివాలయంలో దరఖాస్తు చేసుకోగా కొత్త పింఛను మంజూరైంది. ఈ డబ్బు నా కుటుంబ పోషణకు భరోసాగా ఉంటుంది.

– బోయ వెంకటేశ్వర్లు, కృష్ణగిరి

కర్నూలు జిల్లా		నంద్యాల జిల్లా
2,36,089	మొత్తం పింఛన్లు	2,13,642
6,122	ఇందులో కొత్త పింఛన్లు	4,963
1,66,594	మొదటి రోజు పంపిణీ	1,54,607

5న మరికొన్ని కొత్త పింఛన్లకు నగదు

జిల్లాకు మరికొన్ని కొత్త పింఛన్లు మంజూరు కానున్నాయి. ఇప్పటికే ఉమ్మడి జిల్లాకు 11,085 కొత్త పింఛన్లు మంజూరు కాగా పంపిణీ కూడా జరుగుతోంది. మొదటి విడతలో మంజూరు చేసిన కొత్త పింఛన్లతో ప్రభుత్వంపై అదనంగా రూ.3,12,60,500 భారం పడుతోంది. మరిన్ని కొత్త పింఛన్ల మంజూరుకు డేటా వెరిఫికేషన్ కోసం గ్రామ, వార్డు సచివాలయాలకు చేరింది. అధికారులు వేగవంతంగా పరిశీలన చేస్తున్నారు. కర్నూలు జిల్లాలో 76.38 శాతం, నంద్యాల జిల్లాలో 84.76 శాతం వెరిఫికేషన్ పూర్తయింది. ఈనెల 4న కొత్త పింఛన్ల మంజూరు జాబితాను ప్రకటించనుండగా.. 5వ తేదీ పంపిణీ చేయనున్నారు.

క్లుప్తంగా

విధుల్లో చేరిన బీసీ కార్పొరేషన్ ఈడీ నాగేశ్వరరావు



కర్నూలు(అర్బన్): జిల్లా వెనుకబడిన తరగతుల ఆర్థిక సహకార సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఎ.నాగేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఆరోగ్య సమస్యలతో ఈ ఏడాది మే 2 నుంచి ఆగస్టు 31వ తేది వరకు సెలవులో ఉన్నారు. రెగ్యులర్ ఈడీ సెలవుపై వెళ్లడంతో అప్పటి నుంచి ఇప్పటి వరకు కార్యాలయం ఏఈఓ జాకీర్‌హుసేన్ ఇన్‌చార్జి ఈడీగా బాధ్యతలు నిర్వహించారు. ఈ నేపథ్యంలోనే నాగేశ్వరరావు శుక్రవారం జిల్లా ఇన్‌చార్జికలెక్టర్ నారపురెడ్డి మౌర్యను కలిసి ఆమె అనుమతితో ఈడీగా బాధ్యతలు చేపట్టారు.

బయోమెట్రిక్ అథెంటికేషన్ తప్పనిసరి

కర్నూలు(అర్బన్): కేంద్ర ప్రభుత్వ ఉపకార వేతనాల మంజూరుకు బయోమెట్రిక్ అథెంటికేషన్ తప్పనిసరని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి ఎస్.సబీహా పర్వీన్ తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే బయోమెట్రిక్ అథెంటికేషన్ పూర్తి చేసుకున్న విద్యా సంస్థల్లో 2022–23 విద్యా సంవత్సరంలో చదివిన విద్యార్థులకు(9వ తరగతి నుంచి) బయోమెట్రిక్ అథెంటికేషన్ చేయించాలన్నారు. విద్యార్థుల బయోమెట్రిక్ అథెంటికేషన్‌కు సీఎస్‌సీ గ్రామ స్థాయి ఎంటర్‌ప్రూనర్ ఆయా విద్యా సంస్థలకు వెళ్తారన్నారు. బయోమెట్రిక్ అథెంటికేషన్ పూర్తయిన విద్యార్థుల ఆన్‌లైన్ దరఖాస్తులను విద్యా సంస్థల లాగిన్‌లో పరిశీలించి జిల్లా నోడల్ అధికారి లాగిన్‌కు వెంటనే పంపించాలన్నారు. మరింత సమాచారం కోసం రాజు : 9849189307, వేణుగోపాల్: 9885488088, మహబూబ్‌భాష: 9848864449 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

టీచర్ సస్పెన్షన్

కర్నూలు సిటీ: గూడురు మండలం బూడిదపాడు గ్రామ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్స్ టీచర్‌గా పనిచేస్తున్న వి.రమణారెడ్డిని సస్పెండ్ చేసినట్లు డీఈఓ డాక్టర్ వి.రంగారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈయన గత నెల 18 నుంచి రిమాండ్‌లో ఉన్నారని, తెలంగాణ కోర్టు రిమాండ్ ఆదేశించిన రోజునే సస్పెండ్ చేశామన్నారు.

అర్హుల పెన్షన్ పరిశీలన పూర్తి చేయాలి

కర్నూలు(సెంట్రల్): పెండింగ్‌లోని అర్హుల పెన్షన్ పరిశీలన ప్రక్రియ నేటిలోపు పూర్తి చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ నారపురెడ్డి మౌర్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం ఆమె మండలాల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా హౌసింగ్, ప్రాధాన్యత భవనాలు, ఉపాధి హామీ, విద్యాశాఖలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలతో పాటు చెత్త సంపద తయారీ కేంద్రాలను సెప్టెంబర్ 15లోపు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. బడి బయట ఉన్న 36,047 మంది విద్యార్థులను బడిలో చేర్పించాలని మండల విద్యాశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో ఇన్‌చార్జి హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి, పీఆర్ ఎస్‌ఈ సుబ్రమణ్యం, డ్వామా పీడీ అమర్‌నాథరెడ్డి, ఏపీసీ కె.వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సరిలేరు మీకెవ్వరూ..!

- బోధనలో నిష్ణాతులు
- సామాజిక సేవలో భాగస్వామ్యం
- ఉమ్మడి జిల్లాలో ఐదుగురు ఉపాధ్యాయులకు రాష్ట్రస్థాయి అవార్డులు

కర్నూలు సిటీ/గోనెగండ్ల/గడివేముల/కొలిమిగుండ్ల: అక్షరాలు నేర్పడంలో...ఆదర్శాలు నింపడంలో.. ఆ ఉపాధ్యాయులు గుర్తింపు పొందారు. ఎందరో బాలబాలికలను ఉన్నతులుగా తీర్చిదిద్దారు. ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే పేద విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపారు. డ్రాపౌట్లు లేకుండా తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. తాము ఎక్కడుంటే అక్కడి పాఠశాలలకు పేరు తీసుకొచ్చారు. వృత్తిలో నిబద్ధతను చాటుతూ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారు. ఈనెల 5వ తేదీన ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విశాఖపట్నంలో అవార్డులు అందుకోనున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికైన సిరిగిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, ఎం.విజయభాస్కర్, బాలసుబ్బారెడ్డి, దస్తగిరిమ్మ, నిర్మల జ్యోతిపై ప్రత్యేక కథనం



గతేడాది నంద్యాల జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని చేతుల మీదుగా ఉత్తమ టీచర్ అవార్డును అందుకుంటున్న సిరిగిరెడ్డి రాజశేఖర్ రెడ్డి

చదువు విలువ తెలియజేస్తూ..

వెల్దుర్తి మండలం పుల్లగుమ్మి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు సిరిగిరెడ్డి రాజశేఖర్ రెడ్డి వృత్తికే పరిమితం కాకుండా సామాజిక సేవ కూడా చేస్తున్నారు. బడి ఈడు పిల్లలందరూ పాఠశాలలో ఉండాలనే ఉద్దేశంతో తాను ఉద్యోగం పొందిన గ్రామంలో ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులకు చదువు విలువను తెలిజేస్తున్నారు. ఈయన మాటలకు స్ఫూర్తి పొందిన ఓ దివ్యాంగుడు ముంబై ఐఐటీలో బీటెక్ పూర్తి చేసి ఓ ఉన్నత ఉద్యోగ సాధనకు సిద్ధం అవుతున్నారు. మరో డ్రాపౌట్ స్టూడెంట్ ఉన్నత విద్యాభ్యాసం పూర్తి చేసుకుని సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నారు.

ఇవీ విజయాలు..

- సిరిగిరెడ్డి రాజశేఖర్ రెడ్డి 1996 డీఎస్సీ ద్వారా ఎస్‌జీటీగా ఎంపికయ్యారు. కర్నూలు రూరల్ మండలం పడిదెంపాడు ప్రాథమిక పాఠశాలకు మొదటి పోస్టింగ్ పొందారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను 150 నుంచి 270కి పెంచారు. దీంతో ప్రాథమిక పాఠశాల హైస్కూల్‌గా మారింది.
- గణితం స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొంది 2009లో ఓర్వకల్లు మండలం మీదివేములకు వెళ్లారు. అక్కడ బీసీ హాస్టల్ ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. విద్యార్థుల సంఖ్యను 100 నుంచి 380కి పెంచారు.
- 2010లో చదువుల పండుగ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌గాను, డ్రాపౌట్స్ నివారణపై అనేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. లీడ్ ఇండియా ఫౌండేషన్ శిక్షణ కార్యక్రమాలలో శిక్షణ ఇచ్చారు.
- 3249 సంఖ్యకు సిరిగిరెడ్డి సంఖ్య అని నామకరణం చేసుకున్నారు.
- విద్యార్థుల కోసం గణిత చేతి పుస్తకం రూపకల్పన చేశారు.
- 2018లో దేశ వ్యాప్తంగా ఎన్‌సీఈఆర్‌టీ నిర్వహించిన జాతీయ గణితం సదస్సులో పాల్గొన్నారు.
- 2012–23లో 4, 5 గణితం పాఠ్యపుస్తకాలను, 2018–19లోను 6వ తరగతి గణితం పాఠ్యపుస్తకాలను రచించారు.
- ఓపెన్ స్కూల్ పుస్తకాలను, ఉపాధ్యాయుల శిక్షణకు కావాల్సిన మాడ్యుల్స్‌ను తయారు చేసి అందరి మన్నలు పొంది గతేడాది జిల్లా స్థాయి బెస్ట్ టీచర్ అవార్డును అందుకున్నారు.

వృత్తితోపాటు సామాజిక సేవ



గోనెగండ్ల మండల కేంద్రంలోని ఎంపీపీఎస్(హెచ్.డబ్ల్యూ)లో ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంగా పని చేస్తున్న ఎం.విజయభాస్కర్ ఉత్తమ బోధనతో గుర్తింపు పొందారు. 1997లో మొదటగా ఎస్‌జీటీగా హొళగుందలో ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఇదే మండలంలోనే ఎం.ఎల్.ఓ, ఎంఆర్‌పీగా సేవలు అందించారు. 2002–06లో సమగ్ర శిక్ష అభియాన్(నేడు సమగ్ర శిక్ష)లో అసిస్టెంట్ ఏఎంగాను, 2006–09 వరకు నేషనల్ చైల్డ్ లేబర్ ప్రాజెక్టులో అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా పని చేశారు. ఆ సమయంలో ఆదోని ప్రాంతంలో సీడ్ పత్తి పొలాల్లో పనులు చేస్తున్న బాలకార్మికులకు అవగహన కల్పించి చదువుల వైపు వెళ్లేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన సేవలకు గుర్తుగా మూడుసార్లు ఉన్నతాధికారులతో ప్రశంసాపత్రాలను అందుకున్నారు. నాగలాపురం స్కూల్ హెచ్ఎంగా బదిలీ అయ్యాక రాష్ట్ర స్థాయిలో ప్రాథమిక విద్యలో కమ్యూనికేటివ్ ఇంగ్లిష్‌లో స్టేట్ రిసోర్స్ పర్సన్‌గా పని చేశారు. 3, 4 తరగతుల ఇంగ్లిష్ పాఠ్యపుస్తకాలు రచించారు. ఇప్పటికీ రాష్ట్ర స్థాయిలో ఇంగ్లిష్‌కు సంబంధించిన వెబ్‌నార్లు నిర్వహిస్తున్నారు. ప్రైమరీ తరగతులకు సంబంధి ఈ–కంటెంట్‌తో కూడిన ఐదు వీడియోలను తయారు చేశారు. స్పందన ఇంటర్నెషనల్ ఫౌండేషన్ అనే సంస్థ అధ్యక్షుడిగా పాఠశాల, కాలేజీల్లో విద్యార్థుల ఆత్మహత్యల నివారణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 2012లో జిల్లా స్థాయిలో ఉత్తమ టీచర్ అవార్డును అందుకున్నారు.

పచ్చదనాన్ని పెంచుతూ.. క్రమశిక్షణ నేర్పుతూ



కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాల హెచ్ఎం బాలసుబ్బారెడ్డి ఉద్యోగ ప్రస్థానం 1985 సెప్టెంబర్ 22న మొదలైంది. మద్దికెర మండలంలోని బసినేపల్లిలో ఉపాధ్యాయ వృత్తి ప్రారంభించారు. వివిధ పాఠశాలల్లో పనిచేస్తూ విద్యార్థులను తీర్చిదిద్దారు. 2023 జూన్‌లో స్కూల్ అసిస్టెంట్ నుంచి హెచ్ఎంగా పదోన్నతి వచ్చింది. ఈయన అంకిరెడ్డిపల్లె, కొలిమిగుండ్ల, అవుకు ఉన్నత పాఠశాలల్లో పని చేశారు. అక్కడ పాఠశాలల్లో పచ్చదనాన్ని అభివృద్ధి చేయడంతోపాటు విద్యార్థులకు మంచి క్రమశిక్షణ నేర్పారు. 38 ఏళ్ల ఉపాధ్యాయ వృత్తిలో మూడు సార్లు మాత్రమే తాను ప్రార్థనా సమయానికి హాజరు కాలేక పోయానని ఈయన చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పదవీ విరణమ వయస్సు 62 ఏళ్లకు పెంచడంతోనే తనకు హెచ్ఎంగా ప్రమోషన్ వచ్చిందని, ప్రస్తుతం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకోగలుగుతున్నానని భావోద్వేగంతో చెప్పారు.

అనాథ చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ



గడివేముల మండలం కరిమద్దెల ఎంపీపీ స్కూల్‌లో పనిచేస్తున్న నిర్మల జ్యోతిలు రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికయ్యారు. ఈమె ఉద్యోగ ప్రస్థానం 1996 అనంతపురం జిల్లా తాడిపత్రిలో మొదలైంది. అనంతరం కర్నూలు జిల్లా గోస్పాడు మండలం దీబగుంట్ల, జూలేపల్లి, శిరివెళ్ల మండలం బోయిలకుంట్ల పాఠశాలలో పని చేశారు. ప్రస్తుతం కరిమద్దెల ఎంపీపీ పాఠశాలలో పని చేస్తున్నారు. రాష్ట్ర స్థాయి అవార్డు రావడం పట్ల ఎంతో ఆనందంగా ఉందన్నారు. తన 27 ఏళ్ల సర్వీసులో విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దానన్నారు. ముఖ్యంగా అనాథ చిన్నారుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపానన్నారు. అవసరైన పుస్తకాలతో పాటు స్టేషనరీ, దుస్తులు అందజేశానన్నారు. తండ్రి గొట్టి ముక్కల బాల వెంకటయ్య స్ఫూర్తితో భర్త ఆనంద్, తమ్ముడు సురేష్ ప్రోత్సాహంతో ముందుకెళ్తున్నారు.

నైపుణ్యాలను వెలికితీస్తూ..



గడివేముల మండలం గడిగరేవుల జెడ్పీ పాఠశాలలో పనిచేస్తున్న సోషల్ స్కూల్ అసిస్టెంట్ దస్తగిరిమ్మ రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ఈమె 2000లో నంద్యాల మున్సిపల్ ప్రాథమిక పాఠశాల నుంచి ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించారు. అనంతరం జూపాడుబంగ్లా మండలం తూడిచెర్ల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, నందికొట్కూరు, గడివేముల జెడ్పీ హైస్కూల్‌లో పని చేశారు. ప్రస్తుతం గడివేముల మండలం గడిగరేవుల పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్నారు. 2014 మండల స్థాయిలో, 2017లో జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుని అవార్డు అందుకున్నారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికితీయడంలో ప్రతిభ చాటినందుకు ఈ ఏడాది ఈమెకు రాష్ట్ర స్థాయి అవార్డు దక్కింది.

ఏడో రోజు 246 మంది ఎంపిక

కర్నూలు: ఎస్ఐ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన మహిళా అభ్యర్థులకు కర్నూలు ఏపీఎస్పీ రెండవ బెటాలియన్ మైదానంలో 7వ రోజు శారీరక సామర్థ్య పరీక్షలు నిర్వహించారు. కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్‌కుమార్, సెబ్ అడిషనల్ ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ పర్యవేక్షణలో జరిగిన ఈ పోటీలకు 697 మంది మహిళా అభ్యర్థులను పిలువగా 486 మంది హాజరయ్యారు. వీరికి ధృవపత్రాలు (సర్టిఫికెట్లు) పరిశీలన తర్వాత బయోమెట్రిక్, ఎత్తు, బరువు తదితర ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్టులు నిర్వహించారు. అనంతరం వీరందరికీ ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్టులు 1,600 మీటర్లు, 100 మీటర్ల పరుగుతో పాటు లాంగ్‌జంప్ పరీక్షలు నిర్వహించారు. ఆయా పోటీల్లో ప్రతిభను కనపరచి 246 మంది మహిళా అభ్యర్థులు తుది రాత పరీక్షకు (మెయిన్స్) అర్హత సాధించారు.



డిజిటల్ యంత్రం ద్వారా ఎత్తును పరిశీలిస్తున్న డీఐజీ సెంథిల్ కుమార్

మహిళ అనుమానాస్పద మృతి



కుమార్తె మహిలతతో రాజేశ్వరి (ఫైల్)

కోసిగి: మండల పరిధిలోని కామన్‌దొడ్డి గ్రామానికి చెందిన తలారి రాజేశ్వరి (20) అనే వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కౌతాళం వెంకటేష్, అంజినమ్మ దంపతుల కుమార్తె రాజేశ్వరికి అదే గ్రామానికి చెందిన తలారి నరసింహులు, లక్ష్మీ దంపతుల కుమారుడు భీమయ్యతో రెండేళ్ల క్రితం వివాహం జరిపించారు. వారికి ఏడాది పాప ఉంది. అయితే పెళ్లి చేసుకున్న నాటి నుంచి భీమయ్య మద్యానికి బానిసై భార్య రాజేశ్వరిని వేధింపులకు గురి చేసేవాడు. భర్తను మద్యం మానిపించాలని గోనెగండ్ల మండలం గంజహళ్లి గ్రామంలో నాటువైద్యం చేయించేందుకు బైక్ పై భార్యభర్త, కుమార్తెతో కలిసి బుధవారం సాయంకాలం బయలు దేరి వెళ్లారు. అక్కడ నాటు వైద్యం చేయించుకుని తిరిగి స్వగ్రామం వస్తుండగా గంజహళ్లి గ్రామ శివారులోనే బైక్ అదుపు తప్పి కిందకు పడి పోయి ఆమె అక్కడిక్కడే మృతి చెందిందని భర్త గోనెగండ్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బైక్ అదవు తప్పి కిందకు పడిపోతే భీమయ్య, కుమార్తె మహిలతకు ఎలాంటి గాయాలు కాలేదు. అలాగే బైక్ కూడ దెబ్బ తినలేదు. మృతిరాలికు కూడా ఎక్కడ గాయాలు కనిపించడం లేదు. దీంతో మృతిరాలు తల్లిదండ్రులు కౌతాళం వెంకటేష్, అంజినమ్మలు తమ కుమార్తెను అల్లుడు భీమయ్య హత్య చేశాడని ఆరోపిస్తూ గోనెగండ్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా.. మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించకుండా మృతిరాలు తల్లిదండ్రులు అడ్డుకున్నారు. అనాథగా మారిన చిన్నారి మహిలతకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కోసిగి పోలీసులు, గ్రామ పెద్దలు న్యాయం చేసేలా చూస్తామని భరోసా ఇవ్వడంతో అంత్యక్రియలు నిర్వహించారు.

జగనన్న విద్యా దీవెన ఈకేవైసీపై దృష్టి పెట్టండి

- తల్లుల ఆధార్ నెంబర్లను ఎన్‌పీసీఐకి మ్యాప్ చేయించండి
- సాంఘిక సంక్షేమ శాఖ జేడీ జె.రంగలక్ష్మిదేవి

కర్నూలు(అర్బన్): జిల్లాలో అర్హత కలిగిన ఎస్సీ విద్యార్థులందరికీ జగనన్న విద్యా దీవెన అందించేందుకు ఈకేవైసీపై ప్రత్యేక దృష్టి సారించాలని సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ జె.రంగలక్ష్మీదేవి ఆదేశించారు. శుక్రవారం స్థానిక సంక్షేమ భవన్‌లోని తన చాంబర్‌లో ఆమె జిల్లాలోని సహాయ సంక్షేమాధికారులు, వసతి గృహ సంక్షేమాధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతా నెంబర్లకు ఎన్‌పీసీఐ మ్యాపింగ్ చేయించాలన్నారు. ఆధార్ నెంబర్ ఖాతా నెంబర్‌కు మ్యాప్ కాకుంటే పోస్టల్ ఖాతా ఓపెన్ చేయించి ఎన్‌పీసీఐకి మ్యాపింగ్ చేయించాలన్నారు. అలాగే 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి తల్లుల ఖాతాల్లో జమ అయిన 2వ విడత జగనన్న విద్యా దీవెన మొత్తాలను ఆయా కళాశాలల్లో చెల్లించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇంటర్మీడియట్ చదువుతున్న ఎస్సీ విద్యార్థుల ఆధార్ నెంబర్లను కూడా బ్యాంకు ఖాతాకు లింక్ చేయించాలన్నారు. 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు వచ్చేందుకు వీలుగా స్టడీ అవర్స్‌ను పాటించాలని, అలాగే కోచింగ్ ఇప్పించడంతో పాటు మోటివేషన్ క్లాసులు నిర్వహించాలన్నారు. సమావేశంలో సహాయ సంక్షేమాధికారులు కె.బాబు, సుధాకర్, లీలావతి, బి.మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేడీ రంగలక్ష్మిదేవి

మెడిసిన్ విద్యార్థి దుర్మరణం

- మరో విద్యార్థికి తీవ్ర గాయాలు
- బైక్‌పై వెళ్తుండగా ఢీకొన్న లారీ

పాణ్యం: చెవి నొప్పికి చికిత్స చేయించుకునేందుకు వెళ్తూ ఓ మెడిసిన్ విద్యార్థి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అతనితోపాటు వెళ్లిన మరో విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ దుర్ఘటన బలపనూరు సమీపంలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. నెల్లూరు నగరం నాయుడుపేటకు చెందిన చంద్రబాబు, శారదల ఏకైక కుమారుడు అమరావతి పర్వేష్ (23) పాణ్యం సమీపంలోని శాంతిరామ్ మెడికల్ కళాశాలో ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. బలపనూరు గ్రామంలో అద్దె రూంలో ఉంటున్నాడు. మూడు రోజుల నుంచి చెవినొప్పి ఉండగా.. గురువారం అర్ధరాత్రి అధికమవ్వడంతో తోటి స్నేహితులకు సమాచారం ఇచ్చాడు. ఆసుపత్రికి వెళ్దామని, త్వరగా రావాలని కోరాడు. దీంతో తోటి స్నేహితులు రెండు బైక్‌లపై వచ్చారు. ఒక బైక్‌కు పెట్రోల్ అయిపోవడంతో పెట్రోల్ బంక్‌కు వెళ్లారు. మరో బైక్‌పై మార్కాపురం పట్టణానికి చెందిన నవీన్‌కుమార్ రెడ్డి, అమరావతి పర్వేష్ శాంతిరాం ఆసుపత్రికి బయలుదేరారు. హైవేలో గుర్రాలషెడ్ వద్ద ఆగిఉన్న కారు సడన్‌గా కదిలడంతో వీరు బైక్‌ను ఎడమవైపునకు తిప్పారు. వెనుక నుంచి వేగంగా వస్తున్న లారీ బైక్‌ను, కారును ఢీకొట్టింది. ఈ ఘటనలో అమరావతి పర్వేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. నవీన్‌కుమార్ రెడ్డి కాళ్లపై లారీ టైర్లు ఎక్కాయి. కారులో ఉన్న వారు సురక్షితంగా బయటపడ్డారు. నవీన్‌కుమార్ రెడ్డిని శాంతిరాం ఆసుపత్రికి తీసుకెళ్లగా.. దెబ్బతిన్న రెండు కాళ్లను డాక్టర్లు తొలగించారు. విషయం తెలుసుకున్న హైవే పెట్రోల్ సిబ్బంది రాత్రి సమయంలో వాహనాలను తొలగించి ట్రాఫిక్ సమస్య లేకుండా చేశారు. నెల్లూరు నుంచి చంద్రబాబు, శారద దంపతులు శాంతిరాం ఆసుపత్రికి చేరుకుని కుమారుడి మృతదేహాన్ని ఊసి సొమ్మసిల్లి పడిపోయారు. మృతుడి తండ్రి చంద్రబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పాణ్యం పోలీసులు తెలిపారు.



మృతి చెందిన అమరావతి పర్వేష్



తీవ్రగా గాయపడిన నవీన్‌కుమార్‌రెడ్డి



ప్రమాదానికి కారణమైన లారీ

పంచాయతీరాజ్‌లో పదోన్నతుల జాతర

- 8 మంది ఈఓఆర్‌డీ, ఒక ఏఓకు ఎంపీడీఓలుగా పదోన్నతి
- ఈఓఆర్‌డీలుగా సీనియర్ అసిస్టెంట్లు, గ్రేడ్–1 పంచాయతీ కార్యదర్శులు

కర్నూలు(అర్బన్): పంచాయతీరాజ్ విభాగంలో వివిధ కేడర్లలో పనిచేస్తున్న ఉద్యోగులకు భారీగా పదోన్నతులు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈఓఆర్‌డీ, ఏఓ కేడర్ల నుంచి తొమ్మిది మందికి ఎంపీడీఓలుగా పదోన్నతి లభించింది. అలాగే జిల్లా పరిషత్, మండల పరిషత్, వివిధ ఇంజనీరింగ్ విభాగాల్లో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్లు, వివిధ గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న గ్రేడ్–1 పంచాయతీ కార్యదర్శులకు ఈఓఆర్డీలుగా పదోన్నతి దక్కింది.

- ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈఓఆర్‌డీలుగా పనిచేస్తున్న శ్రీకాంత్ చౌదరి, సూర్యనారాయణ, నాగేశ్వరరెడ్డి, వరప్రసాదరావు, సుబ్రహ్మణ్య శర్మ, పాపారాయుడు, వెంకటరెడ్డి, భాస్కర్ రాజుతో పాటు పాములపాడు ఎంపీడీఓ కార్యాలయంలో పరిపాలన అధికారిగా పనిచేస్తున్న జ్యోతికి ఎంపీడీఓలుగా పదోన్నతి పొందారు. వీరికి వేర్వేరు జిల్లాలకు పోస్టింగులు ఇస్తూ పంచాయతీరాజ్ కమిషనరేట్ ఉత్తర్వులు జారీ చేసింది.
- అలాగే 9 మంది సీనియర్ అసిస్టెంట్లు, దాదాపు 15 మంది గ్రేడ్–1 పంచాయతీ కార్యదర్శులకు ఈఓఆర్‌డీలుగా పదోన్నతి లభించినట్లు సమాచారం. ఇందుకు సంబంధించి ఈ నెల 2వ తేదీన స్పష్టత రానుంది.
- రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంచాయతీరాజ్ శాఖపై ప్రత్యేక శ్రద్ధ కనపరుస్తూ దశాబ్దాలుగా పదోన్నతులకు నోచుకోని ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తోంది.
- ఈ నేపథ్యంలోనే గత ఏడాది డిసెంబర్‌లో 14 మంది ఎంపీడీఓలకు పదోన్నతులు లభించాయి.
- అలాగే ఈ ఏడాది మే నెలలో 12 మంది ఈఓఆర్డీ, 13 మంది ఏఓలకు పదోన్నతులు కల్పించింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల పట్ల పంచాయతీరాజ్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కౌలు రైతుకు అన్ని విధాలా తోడ్పాటు

- లబ్ధిదారులకు రైతు భరోసా మెగా చెక్కును అందజేసిన ఇన్‌చార్జి కలెక్టర్, పాణ్యం ఎమ్మెల్యే

కర్నూలు(సెంట్రల్): కౌలు రైతుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా తోడ్పాటు అందిస్తోందని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కౌలు రైతులకు వైఎస్సార్ రైతు భరోసా నిధులను బటన్ నొక్కి బ్యాంక్ ఖాతాల్లో జమచేశారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుంచి ఇన్‌చార్జి కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ శిరోమణి మద్దయ్య, కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకరరెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి పి.వరలక్ష్మి, కౌలు రైతులు వర్చువల్‌గా వీక్షించారు. ఈ సందర్భంగా పాణ్యం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. టీడీపీ హయాంలో కౌలురైతులు ఎలాంటి ప్రభుత్వ పథకాలు అందేవి కాదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక రైతు భరోసా కింద ప్రతిఏటా రూ.13,500 ఇవ్వడంతోపాటు రైతు భరోసా కేంద్రాల్లో సబ్సిడీపై ఎరువులు, మందులు, విత్తనాలను అందిస్తున్నారన్నారు. వ్యవసాయ సలహా మండలం చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. కౌలు రైతులను ఆదుకోవాలన్న లక్ష్యంతో ప్రభుత్వం సీసీఆర్‌సీ కార్డులు ఇస్తోందన్నారు. ఇన్‌చార్జి కలెక్టర్ నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ.. కర్నూలు జిల్లాలో 6,701 కౌలు రైతులకు రూ.5.22 కోట్లను ప్రభుత్వం కేటాయించినట్లు తెలిపారు. అనంతరం కౌలు రైతులకు అధికారులు, ప్రజాప్రనిధులు మెగా చెక్కును అందజేశారు.



మెగా చెక్కును అందజేస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి తదితరులు

రుణాలు ఇప్పించారు



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కౌలు రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటున్నారు. సీసీఆర్‌సీ కార్డులు ఇప్పించి బ్యాంకుల్లో రుణాలు తీసుకునేలా చేశారు. వాటికీ పావలా వడ్డీని వర్తింపజేశారు. రైతు భరోసాను ఇచ్చి పంట పెట్టుబడికి సాయం చేస్తున్నారు. ఆర్‌బీకేల ద్వారా రసాయనిక ఎరువులు, విత్తనాలు తక్కువ ధరకు ఇస్తున్నారు. – డి.మాబు, ఏగోకులపాడు, కల్లూరు మండలం

ఇది రైతుల ప్రభుత్వం



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వ్యవసాయం అంటే మక్కువ. అందుకోసమే రైతులను ఆదుకోవడానికి ఎప్పుడూ ముందు ఉంటారు. ఐదేళ్లగా పెట్టుబడి కింద యేటా రూ.13, 500 ఇచ్చారు. రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారు. విత్తనం వేసింది మొదలు అమ్ముకునే వరకు అన్నదాతకు అండగా ప్రభుత్వం ఉంటోంది. ఇది రైతుల ప్రభుత్వం. జగనన్నకు రైతులు రుణపడి ఉంటారు.–సూర్యనారాయణ, శేషయ్య నగర్, కర్నూలు

IV
సాక్షి బిజినెస్
శనివారం
2-9-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
556	182
65,387	19,435

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్ర రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	14,010	▽	25
డోజోన్స్	34,782	▲	60
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,465	▲	25
డాక్స్	15,840	▽	107
షాంఘై	3,133	▲	13
నికాయ్	32,713	▲	91

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)		
59,489	▲	4
బంగారం (99.5 స్వచ్ఛత)		
59,251	▲	4
వెండి (కిలో)		
74,838	▽	193

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	81.63	83.50
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	103.01	106.40
€	యూరో	ఒకటి	88.08	91.20
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	55.95	57.72
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	52.41	54.75
S$	సింగపూర్ డాలర్	ఒకటి	60.21	62.17
SAR	సౌదీ రియాల్	[illegible]	21.10	22.73
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	21.62	23.42
¥	చైనా యువాన్	[illegible]	10.28	12.35

జీఎస్‌టీ వసూళ్లు 11 శాతం అప్

ఆగస్టులో రూ.1,59,069 కోట్లు



న్యూఢిల్లీ: వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు 2023 ఆగస్టులో గత ఏడాది ఇదే నెలతో పోల్చితే 11 శాతం పెరిగి రూ.1.59 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. అధికారిక గణాంకాలను పరిశీలిస్తే..

- మొత్తం వసూళ్లు రూ.1,59,069 కోట్లు.
- సెంట్రల్ జీఎస్‌టీ వాటా రూ.28,328 కోట్లు.
- ఎస్‌జీఎస్‌టీ వసూళ్లు రూ.35,794 కోట్లు.
- ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ రూ.83,251 కోట్లు.
- సెస్ రూ.11,696 కోట్లు.

ఆర్థిక సంవత్సరంలో తీరిది...

ఆర్థిక సంవత్సరం తొలి నెల ఏప్రిల్లో చరిత్రాత్మక స్థాయిలో రూ.1.87 లక్షల కోట్ల అత్యధిక వసూళ్లు నమోదయ్యాయి. మే, జూన్‌లో వరుసగా రూ.1.57 లక్షల కోట్లు, రూ.1.61 లక్షల కోట్లు ఒనగూరాయి.

గ్రీస్‌లో జీఎంఆర్ మరిన్ని పెట్టుబడులు



ముంబై: గ్రీస్‌లో విమానాశ్రయాన్ని అభివృద్ధి చేస్తున్న దేశీ దిగ్గజం జీఎంఆర్ గ్రూప్.. ఆ దేశంలో మరిన్ని పెట్టుబడులు పెట్టే యోచనలో ఉంది. కెలమాటా ఎయిర్‌పోర్ట్‌లో ఇన్వెస్ట్ చేసే అవకాశాలను పరిశీలిస్తోంది. ప్రస్తుతం జీఈకే టెర్నా సంస్థతో కలిసి గ్రీస్‌లోని క్రెటె ప్రాంతంలో హెరాక్లియోన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు జీఎంఆర్ గ్రూప్ తెలిపింది. హెరాక్లియోన్ విమానాశ్రయ పనులు చురుగ్గా సాగుతున్నాయని ఇంధన, అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్స్ వ్యాపార విభాగం చైర్మన్ శ్రీనివాస్ బొమ్మిడాల తెలిపారు. ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనలో భాగంగా గ్రీస్ ప్రధాన మంత్రి నిర్వహించిన విందులో శ్రీనివాస్ కూడా పాల్గొన్నారు. భారత్, గ్రీస్ మధ్య కనెక్టివిటీ మెరుగుపడితే ఇరు దేశాల స్థూల దేశీయోత్పత్తి వృద్ధికి, వ్యాపార అవకాశాల కల్పనకు తోడ్పడగలదని ఆయన పేర్కొన్నారు.

93 శాతం 2,000 నోట్లు వెనక్కు వచ్చేశాయ్: ఆర్‌బీఐ

ముంబై: ఉపసంహరణ నిర్ణయం వెలువడిన మే 19వ తేదీ నాటికి చెలామణిలో ఉన్న రూ.2,000 నోట్లలో 93 శాతం తిరిగి వచ్చేశాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ప్రకటన ఒకటి పేర్కొంది. ఆర్‌బీఐ ప్రకటన ప్రకారం, ఆగస్టు 31వ తేదీ నాటికి చెలామణిలో ఉన్న రూ.2,000 నోట్ల విలువ రూ.0.24 లక్షల కోట్లకు పడిపోయింది. బ్యాంకులకు తిరిగి వచ్చిన నోట్లలో 87 శాతం డిపాజిట్ల రూపంలో జరగ్గా, 13 శాతం బ్యాంకుల్లో ఇతర కరెన్సీలోకి మార్పిడి ద్వారా వెనక్కువచ్చాయి. అధిక విలువ నోట్లు కలిగి ఉన్న ప్రజలు 2023 సెప్టెంబరు 30 నాటికి ఆ నోట్లను డిపాజిట్ చేయాలని లేదా నిబంధనలకు అనుగుణంగా మార్చుకోవాలని ఆర్‌బీఐ సూచించింది. 2016 నవంబర్లో రూ.500, రూ.1,000 నోట్లను రద్దుచేసి కొత్త రూ.500, రూ.2,000 నోట్లను తీసుకువచ్చిన ఆర్‌బీఐ, మే 19వ తేదీన ఒక కీలక ప్రకటన చేస్తూ, రూ.2,000 నోట్లను కూడా సెప్టెంబర్ 30 నాటికి పూర్తిగా వెనక్కు తీసుకుంటున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. నిజానికి 2018–19లోనే ఆర్‌బీఐ రూ. 2,000 నోట్ల ముద్రణను నిలిపివేసింది. 2018 మార్చి 31వ తేదీ నాటికి రూ.2,000 నోట్ల గరిష్ఠ



చెలామణీ విలువ రూ.6.73 లక్షల కోట్లు. చెలామణీలో ఉన్న మొత్తం రూ.2,000 నోట్లలో ఈ విలువ 37.3 శాతానికి సమానం. 2023 మార్చి 31వ తేదీ నాటికి రూ.2,000 నోట్ల చెలామణీ విలువ రూ.3.62 లక్షల కోట్లు. చెలామణీలో ఉన్న మొత్తం నోట్లలో ఈ విలువ 10.8% మాత్రమే. వ్యవస్థలో 2,000 నోట్ల వినియోగం ఇంధనం, బంగారు ఆభరణాలు, కిరాణా కొనుగోళ్లకు అధికంగా వినియోగిస్తున్నట్లు ఇప్పటికే పలు సర్వేలు వెల్లడించాయి.

ఎయిర్ ఇండియా-విస్తారా విలీనానికి గ్రీన్ సిగ్నల్

కాంపిటీషన్ కమిషన్ ఆమోదముద్ర

న్యూఢిల్లీ: ఎయిర్ ఇండియా–విస్తారా విలీనబాటలో కీలక అడుగు పడింది. కొన్ని షరతులకు లోబడి ఎయిర్ ఇండియా–విస్తారా ప్రతిపాదిత విలీనాన్ని కాంపిటీషన్ కమిషన్ శుక్రవారం ఆమోదించింది. తన విమానయాన వ్యాపారాన్ని ఒకే గొడుగు కిందకు తీసుకురావడానికి సంబంధించి టాటా గ్రూప్‌కు ఇది ఒక ప్రధాన ముందడుగు. ప్లాట్‌ఫారమ్ 'ఎక్స్' పై చేసిన ఒక పోస్టింగ్‌లో విలీనానికి ఆమోదముద్ర వేసినట్లు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) తెలిపింది. ''ఎయిరిండియాలో టాటా ఎస్ఐఏ ఎయిర్‌లైన్స్ విలీనానికి సీసీఐ ఆమోదం తెలిపింది. పార్టీలు అందించే స్వచ్ఛంద కట్టుబాట్లకు, విధి విధానాలకు లోబడి ఎయిరిండియాలో



సింగపూర్ ఎయిర్‌లైన్స్ నిర్దిష్ట వాటాలను కొనుగోలు చేస్తుంది' అని సీసీఐ పేర్కొంది. విస్తారా, ఎయిర్ ఇండియా టాటా గ్రూప్‌లో భాగంగా ఉన్న రెండు వేర్వేరు విమానయాన సంస్థలు. సింగపూర్ ఎయిర్‌లైన్స్‌కు విస్తారాలో 49% వాటా ఉంటే, టాటా సన్స్ వాటా 51%గా ఉంది. ఎయిరిండియాలో 25.1% వాటాను సింగపూర్ ఎయిర్‌లైన్స్ కొనుగోలు చేయనున్న ఒప్పందం ప్రకారం విస్తారాను ఎయిర్ ఇండియాతో విలీనం చేస్తున్నట్లు గతేడాది నవంబర్‌లో టాటా గ్రూప్ ప్రకటించింది.

ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో వార్‌బర్గ్ పింకస్ వాటా విక్రయం



న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో అమెరికన్ ప్రైవేట్ ఈక్విటీ సంస్థ వార్‌బర్గ్ పింకస్ 4.2 శాతం వాటాలను ఓపెన్ మార్కెట్ లావాదేవీ ద్వారా విక్రయించింది. వీటి విలువ రూ. 2,480 కోట్లు. బీఎస్‌ఈ డేటా ప్రకారం వార్‌బర్గ్ పింకస్ అనుబంధ సంస్థ క్లోవర్‌డెల్ ఇన్వెస్ట్‌మెంట్ 27.86 కోట్ల షేర్లను (4.2 శాతం) వాటాలను షేరు ఒక్కింటికి రూ. 89 రేటుతో విక్రయించింది. జూన్ ఆఖరు నాటి గణాంకాల ప్రకారం ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో అనుబంధ సంస్థల ద్వారా వార్‌బర్గ్ పింకస్‌కు 8.5 శాతం వాటాలు ఉన్నాయి.

ఆగస్టులో ఆల్‌టైమ్ 'రయ్'!

న్యూఢిల్లీ: దేశీయ ప్యాసింజర్ వాహన అమ్మకాలు ఆగస్టులో ఆల్‌టైం గరిష్టానికి చేరుకున్నాయి. ఎస్‌యూవీ(స్పోర్ట్ యుటిలిటీ వెహికల్స్)లకు డిమాండ్ కొనసాగడం, పండుగ సీజన్ మొదలవడంతో గిరాకీ పుంజుకుందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. మారుతీ సుజుకీ రికార్డు స్థాయిలో అమ్మకాలు జరిపింది. మొత్తం 1,89,082 వాహనాలు విక్రయించింది. గతేడాది ఇదే నెల అమ్మకాలు 1,65,173 యూనిట్లతో పోలిస్తే 14% అధికం. హ్యుందాయ్, ఎంఅండ్‌ఎం, టయోటా కిర్లోస్కర్ కంపెనీలు అమ్మకాల్లో రెండంకెల వృద్ధిని సాధించాయి. టాటా మోటార్స్, హోండా కార్స్ విక్రయాల్లో స్వల్ప క్షీణత నమోదైంది. ద్విచక్ర వాహన విభాగంలో బజాజ్ ఆటో విక్రయాలు 15% తగ్గాయి. హీరో మోటో



కార్ప్, టీవీఎస్ మోటార్స్ అమ్మకాలు వరుసగా 6%, 4% పెరిగాయి. వాణిజ్య వాహనాలు, ట్రాకర్ల అమ్మకాలు కూడా గణనీయంగా పెరిగాయి.

ఆగస్ట్ వాహన అమ్మకాల తీరు..


	2023	2022	వృద్ధి(%)
మారుతీ	1,89,082	1,65,173	(+)14
హ్యుందాయ్	71,435	62,210	(+)15
టాటా మోటార్స్	78,010	78,843	(-)1
ఎండ్ అండ్ ఎం	70,350	59,049	(+)19
హోండా కార్స్	7,880	7,769	(+)1
ఎంజీ మోటార్స్	4,185	3,823	(+)9
టయోటా	22,910	14,959	(+)53
ద్విచక్ర వాహనాలు			
బజాజ్ ఆటో	3,41,648	4,01,595	(-)15
హీరో మోటో	4,88,717	4,62,608	(+)6
టీవీఎస్	3,45,848	3,33,787	(+)4
రాయల్ ఎన్‌ఫీల్డ్	77,583	70,112	(+)11
వాణిజ్య వాహనాలు			
వోల్వో ఐషర్	6,476	5,003	(+)29
అశోక్ లేలాండ్	15,576	14,121	(+)10
ట్రాక్టర్లు			
ఎస్కార్ట్స్	5,198	5,308	(+)2
మహీంద్రా	21,676	21,520	(+)1

కోవర్టు లాబీయింగ్ చేశాయి

- పర్యావరణ చట్టాలను అనుకూలంగా మార్చుకున్నాయి
- అనిల్ అగర్వాల్ సంస్థలను టార్గెట్ చేసిన ఓసీసీఆర్‌పీ
- వేదాంత, కెయిర్న్‌పై ఆరోపణలు

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ ప్రమోటర్లపై ఆరోపణలు గుప్పించిన ఓసీసీఆర్‌పీ తాజాగా పారిశ్రామిక దిగ్గజం అనిల్ అగర్వాల్‌కి చెందిన కంపెనీలు వేదాంత, కెయిర్న్ ఇండియాను టార్గెట్ చేసింది. పర్యావరణ చట్టాలను అనుకూలంగా మార్చుకునేందుకు వేదాంత కోవర్టు లాబీయింగ్ నడిపినట్లు కొత్తగా మరో నివేదికలో ఆరోపించింది. ప్రభుత్వం కూడా ప్రజలను సంప్రదించకుండా నిబంధనల మార్పులను ఆమోదించి, 'అక్రమ పద్ధతుల్లో' అమలు చేసినట్లు పేర్కొంది. ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్టు (ఓసీసీఆర్‌పీ) విడుదల చేసిన నివేదికలోని కొన్ని ప్రధానాంశాలు..

- కొత్తగా పర్యావరణ అనుమతుల అవసరం లేకుండా దేశీయంగా ఉత్పత్తిని 50% వరకు పెంచుకునేందుకు మైనింగ్ కంపెనీలకు అనుమతినిస్తే ఆర్థిక వ్యవస్థ రికవరీ మరింత వేగవంతం కాగలదని 2021 జనవరిలో వేదాంత గ్రూప్ చైర్మన్ అనిల్ అగర్వాల్ అప్పటి పర్యావరణ శాఖ మంత్రి ప్రకాష్ జవదేకర్‌కు లేఖ రాశారు.
- ''2022 తొలినాళ్లలో పలు దఫాల సమావేశాల అనంతరం పర్యావరణ శాఖ నిబంధనలను సడలించింది. ప్రజాభిప్రాయాల సేకరణ నిర్వహించాల్సిన అవసరం లేకుండా మైనింగ్ కంపెనీలు



50 శాతం వరకు ఉత్పత్తిని పెంచుకునేందుకు అనుమతించింది'' అని ఓసీసీఆర్‌పీ తెలిపింది.
- వేదాంత తరహాలోనే దాని అనుబంధ సంస్థ కెయిర్న్ ఆయిల్ అండ్ గ్యాస్ కూడా వ్యవహరించింది. చమురు అన్వేషణ ప్రాజెక్టుల కోసం ప్రజాభిప్రాయ సేకరణ నిబంధనను ఎత్తివేసేందుకు లాబీయింగ్ చేసింది.
- అధికార బీజేపీకి వేదాంత గణనీయంగా విరాళాలు కూడా ఇచ్చినట్లు (2016–2020 మధ్య కాలంలో రూ.43.5 కోట్లు) ఆధారాలు ఉన్నాయని ఓసీసీఆర్‌పీ తెలిపింది.

వేదాంత స్పందన ఇదీ..

ఓసీసీఆర్‌పీ ఆరోపణలను నిర్దుష్టంగా ఖండించకుండా వేదాంత స్పందించింది. 'దిగుమతులకు ప్రత్యామ్నాయంగా పర్యావరణానికి అనుకూలమైన విధానాల్లో దేశీయంగా ఉత్పత్తిని పెంచాలనేది మా లక్ష్యం. దానికి అనుగుణంగా దేశాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని, సహజ వనరుల విషయంలో భారత్ స్వావలంబన సాధించడంలో తోడ్పాటు అందించే ఉద్దేశంతో ప్రభుత్వ పరిశీలన కోసం పలు విజ్ఞప్తులు చేశాము' అని సంస్థ అధికార ప్రతినిధి తెలిపారు.

రెండు నెలల్లో అతిపెద్ద లాభం

- మెప్పించిన స్థూల ఆర్థిక గణాంకాలు
- సెన్సెక్స్ లాభం 556 పాయింట్లు
- 19,400 స్థాయి పైకి నిఫ్టీ

ముంబై: స్థూల ఆర్థిక గణాంకాలు మెప్పించడంతో పాటు ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని సానుకూల సంకేతాలు కలిసిరావడంతో శుక్రవారం స్టాక్ సూచీలు ఒక శాతం మేర ర్యాలీ చేశాయి. సెన్సెక్స్ 556 పాయింట్లు పెరిగి 65,387 వద్ద నిలిచింది. నిఫ్టీ 182 పాయింట్లు బలపడి 19,435 వద్ద స్థిరపడింది. వెరసి గడిచిన రెండు నెలల్లో అతిపెద్ద లాభాన్ని గడించాయి. ట్రేడింగ్ ప్రారంభం నుంచీ ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు మొగ్గుచూపారు. ఫార్మా మినహా అన్ని రంగాల షేర్లూ రాణించాయి. ఒక దశలో సెన్సెక్స్ 642 పాయింట్లు దూసుకెళ్లి 65,473 వద్ద, నిఫ్టీ 205 పాయింట్లు ఎగసి 19,459 వద్ద ఇం



ట్రాడే గరిష్టాలను నమోదు చేశాయి. మెటల్, ఆయిల్‌అండ్‌గ్యాస్, బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లు రాణించి సూచీల ర్యాలీకి ప్రాతినిధ్యం వహించాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.488 కోట్లు, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.2,295 కోట్ల ఈక్విటీలు కొన్నారు. ఈ వారం మొత్తంగా సెన్సెక్స్ 500 పాయింట్లు, నిఫ్టీ 169 పాయింట్లు లాభపడ్డాయి. కాగా, సెన్సెక్స్ భారీ ర్యాలీతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.312.33 లక్షల కోట్లు ఎగబాకింది.

సాక్షి స్పోర్ట్స్

అంతర్జాతీయ క్రికెట్ ఆడనున్న తొలి 'ట్రాన్స్‌జెండర్'గా డానిల్ మెక్‌గహే

అంతర్జాతీయ క్రికెట్‌లో తొలి 'ట్రాన్స్‌జెండర్' బరిలోకి దిగనుంది. లింగ మార్పిడి చేసుకున్న కెనడాకు చెందిన 29 ఏళ్ల డానిల్ మెక్‌గహే ఇప్పుడు మహిళల జట్టు తరఫున క్రికెట్ ఆడుతుంది. అమెరికన్ క్వాలిఫయర్ టోర్నీలో పాల్గొనే కెనడా టి20 జట్టులో ఆమెకు చోటు లభించింది. ఆస్ట్రేలియాలో పుట్టిన ఆమె కెనడాకు వలస వచ్చింది. 2020లో పురుషుడి నుంచి స్త్రీగా మారేందుకు సిద్ధమైన ఆమె 2021లో వైద్యపరంగా పూర్తి స్థాయిలో మహిళగా మారింది. ట్రాన్స్‌జెండర్‌లు అంతర్జాతీయ మ్యాచ్ ఆడేందుకు ఐసీసీ నిర్దేశించిన అర్హత ప్రమాణాలను ఆమె ఇటీవలే అందుకుంది. 'ట్రాన్స్‌జెండర్‌ను మహిళగా గుర్తించాలంటే వరుసగా 12 నెలల పాటు టెస్టోస్టిరాన్ లెవల్ 5 నానోమోల్/లీటర్‌కంటే తక్కువగా ఉండాలి' అనేది ఐసీసీ నిబంధన.



నీరజ్‌కు రెండో స్థానం

జ్యూరిచ్ డైమండ్ లీగ్ మీట్

జ్యూరిచ్ (స్విట్జర్లాండ్): భారత స్టార్ అథ్లెట్, వరల్డ్ చాంపియన్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా ప్రతిష్టాత్మక డైమండ్ లీగ్ మీట్‌లో కాస్త తడబడ్డాడు. ఈ సీజన్ లీగ్ నాలుగో మీట్ బరిలోకి దిగిన నీరజ్ రెండో స్థానంతో సరిపెట్టుకున్నాడు. జ్యూరిచ్‌లో జరిగిన ఈ పోటీల్లో నీరజ్ 85.71 మీటర్ల దూరం జావెలిన్ విసిరాడు. ఈ ఈవెంట్‌లో జాకబ్ వాల్డెచ్ (చెక్ రిపబ్లిక్ – 85.86 మీటర్లు) అగ్రస్థానం సాధించగా... జూలియస్ వెబర్ (జర్మనీ – 85.04 మీటర్లు) మూడో స్థానంలో నిలిచాడు. నీరజ్ విసిరిన ఆరు త్రో లలో 80.79 మీ., 85.22 మీ., 85.71 మీ. దూరాలు నమోదు చేయగా మరో మూడు త్రో లు 'ఫౌల్' అయ్యాయి. అయితే మూడు మీట్‌లలో కలిపి 23 పాయింట్లు సాధించడం ద్వారా మూడో స్థానంతో డైమండ్ లీగ్ ఫైనల్ చాంపియన్‌షిప్‌కు నీరజ్ అర్హత సాధించాడు. గత ఏడాది డైమండ్ లీగ్ చాంపియన్ అయిన నీరజ్...ఈ సీజన్‌లో దోహా, లాసానేలలో అగ్రస్థానం సాధించాడు. గాయం కారణంగా అతను మొనాకో మీట్‌లో పాల్గొనలేకపోయాడు. సెప్టెంబర్ 17నుంచి యూగీన్ (అమెరికా)లో ఫైనల్స్ జరుగుతుంది. ఇతర ఫలితాల్లో లాంగ్‌జంప్‌లో మురళీ శంకర్ ఐదో స్థానంలో నిలిచాడు. అతనూ ఫైనల్స్‌కు అర్హత సాధించడంలో సఫలమయ్యాడు.



జ్యూరిచ్‌లో తన ప్రదర్శన పట్ల నీరజ్ సంతృప్తి వ్యక్తం చేశాడు. వరల్డ్ చాంపియన్‌షిప్ తర్వాత తాను బాగా అలసిపోయానని, కాస్త భుజం నొప్పి కూడా ఇబ్బంది పెట్టిందని నీరజ్ వ్యాఖ్యానించాడు. ఫైనల్స్ సమయానికి తాను 100 శాతం ఫిట్‌గా ఉండాలని కోరుకుంటున్నట్లు అతను చెప్పాడు. పారిస్ ఒలింపిక్స్‌లో స్వర్ణం నిలబెట్టుకోవడం కూడా తన లక్ష్యమని నీరజ్ వెల్లడించాడు.

నేడే 'ఆసియా' అసలు సమరం

భారత్, పాక్ ఢీకి సిద్ధం

- ఫేవరెట్‌గా రోహిత్ సేన
- నంబర్‌వన్ హోదాతో బాబర్ బృందం
- మ్యాచ్‌కు వానగండం
- మ.గం. 3 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

పల్లెకెలె: వన్డే ప్రపంచకప్‌కు ఇంకొన్ని రోజులే ఉంది. మెగా ఈవెంట్‌కు ముందు క్రికెట్ ప్రపంచం ఒళ్లంతా కళ్లు చేసుకునే కీలక మ్యాచ్ నేడు జరుగనుంది. చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్తాన్ జట్లు సై అంటే సై అనే పోరుకు ఆసియా కప్ వన్డే టోర్నీ వేదికైంది. నంబర్‌వన్ పాక్, ఆసియా కప్ ఫేవరెట్ భారత్ మధ్య జరగబోయే ఈ పోరు టోర్నీకే హైలైట్‌గా నిలవడం ఈపాటికే ఖాయమైంది. కేవలం వన్డే ఫార్మాట్‌నే చూసుకుంటే గత వన్డే ప్రపంచకప్ తర్వాత ఇరు జట్లు తలపడే 50 ఓవర్ల పోటీ ఇదే! గతేడాది జరిగిన టి20 వరల్డ్‌కప్‌లో విరాట్ అద్భుత ప్రదర్శన తర్వాత ఇరు జట్లు ఇప్పుడు తలపడుతున్నాయి. మెల్‌బోర్న్ తరహాలో లంక గడ్డపై కూడా మరో హోరాహోరీ ఖాయం.

కొత్త ఉత్సాహంతో రోహిత్ బృందం

గత కొన్నాళ్లుగా స్వదేశంలో జరిగే ప్రపంచకప్ కోసం భారత్ చాలా ప్రయోగాలు చేసింది. రాహుల్, అయ్యర్, బుమ్రావంటి కీలక ఆటగాళ్ల గాయాల నేపథ్యంలో భారత టీమ్ మేనేజ్‌మెంట్ తగిన జాగ్రత్తలు తీసుకొని సీనియర్లు రోహిత్, కోహ్లిలకు బాగా విశ్రాంతినిస్తూ కాపాడుకుంటూ వచ్చింది. ఇక సమయం, సందర్భం రావడంతో టీమిండియా తురుపుముక్కలు బరిలోకి దిగుతున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఇది కచ్చితంగా 'ప్రి ప్రపంచకప్' పోటీనే! ఇందులో ఏ సందేహం లేదు. దాదాపు వరల్డ్‌కప్‌లో బరిలోకి దిగే



ఆసియా కప్ ట్రోఫీతో గత ఏడాది (2022) భారత, పాకిస్తాన్ కెప్టెన్లు రోహిత్ శర్మ, బాబర్ ఆజమ్ (ఫైల్)

జట్టును ఖాయం చేసేందుకు ఈ ఆసియా టోర్నీని జట్టు వాడుకుంటోంది. రోహిత్, కోహ్లిల ఫిట్‌నెస్, జట్టులోకి అనుభవజ్ఞుడైన ఆల్‌రౌండర్ జడేజా పునరాగమనం, మరో ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా, బౌలింగ్ దళపతి బుమ్రా, 'హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్' సిరాజ్ ఇలా చెప్పుకుంటూ పోతే భారత్ పూర్తి స్థాయి ప్రపంచకప్ సైన్యంతో రంగంలోకి దిగుతోంది. దీన్నిబట్టి చూస్తే పాక్ పనిపట్టేందుకు, ఆసియా కప్‌లో ఓడించేందుకు రోహిత్ సేనకు ఏమంత కష్టం కానేకాదు.

పుంజుకున్న బలంతో పాక్

కొంత కాలంగా ఇంటాబయటా నిలకడైన విజయాలు, గట్టి ప్రత్యర్థులను ఓడించిన తీరుతో బాబర్ ఆజమ్ సేన మునుపటి కంటే పుంజుకుంది. బ్యాటింగ్‌లో ఫఖర్–ఇమామ్ ఓపెనింగ్ జోడీ నుంచి ఏడో నంబర్ షాదాబ్ ఖాన్ వరకు బ్యాటింగ్ చేసే సత్తా పాకిస్తాన్ పటిష్టంగా నిలుపుతోంది. బౌలింగ్‌లో పేస్ త్రయం షాహిన్ అఫ్రిది, నసీమ్ షా, రవూఫ్ ఆరంభంలో వికెట్లు పడగొట్టడంతో సఫలమవుతున్నారు. స్పిన్‌లో షాదాబ్, నవాజ్ సత్తా చాటుతుండటంతో పాకిస్తాన్ భారత్‌కు దీటుగా ఉంది. నంబర్‌వన్ హోదా అదనపు స్థైర్యాన్ని తెచ్చిపెట్టగా... రెట్టించిన ఉత్సాహంతో ప్రత్యర్థిని ఢీకొనేందుకు రెడీగా ఉంది.

గత ఐదు వన్డేల్లో...

భారత్, పాక్‌లు తలపడిన గత ఐదు వన్డేల్లో టీమిండియాదే 4–1తో పైచేయిగా ఉంది. 2017 చాంపియన్స్‌ట్రోఫీలో లీగ్ దశలో గెలిచి తుదిపోరులో భారత్ ఓడింది. 2018 ఆసియాకప్‌లో రెండుసార్లు టీమిండియా గెలిచింది. చివరిసారిగా గత వన్డే ప్రపంచకప్(2019)లోనూ భారత్‌దే గెలుపు.

పిచ్-వాతావరణం

ఇది కొత్త పిచ్. పక్కాగా దీనికే అనుకూలమని చెప్పలేం. లంక, బంగ్లా మధ్య జరిగినట్లే సీమర్లు, స్పిన్నర్లకు చక్కని చాన్స్! అయితే మ్యాచ్‌కు వాన ముప్పు పొంచివుంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వాన కురిసే అవకాశముండటంతో మ్యాచ్ మొదలయ్యేందుకు ఆలస్యం కావొచ్చు.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), శుబ్‌మన్, కోహ్లి, అయ్యర్, ఇషాన్ కిషన్, హార్దిక్ పాండ్యా, జడేజా, శార్దుల్ /షమీ, కుల్దీప్, సిరాజ్, బుమ్రా.
పాకిస్తాన్: బాబర్ ఆజమ్ (కెప్టెన్), ఫఖర్ జమాన్, ఇమామ్ ఉల్ హక్, రిజ్వాన్, ఆగా సల్మాన్, ఇఫ్తికార్, షాదాబ్‌ఖాన్, నవాజ్, షాహిన్ షా అఫ్రిది, నసీమ్ షా, రవూఫ్.



మైదానంలో విరాట్ కోహ్లి, రవూఫ్ ముచ్చట్లు

'విషీ'ని దాటిన గుకేశ్

- 'ఫిడే' ర్యాంకింగ్స్‌లో భారత్ తరఫున నంబర్‌వన్
- 37 ఏళ్ల తర్వాత అగ్రస్థానం కోల్పోయిన ఆనంద్



చెన్నై: 1986 జులై 1... చదరంగ మేధావి విశ్వనాథన్ ఆనంద్ భారత నంబర్‌వన్ ఆటగాడిగా మొదటిసారి గుర్తింపు తెచ్చుకున్న రోజు. నాటినుంచి ఇప్పటి వరకు అతనిదే అగ్ర స్థానం. అతని తర్వాత భారత్‌నుంచి పెద్ద సంఖ్యలో కుర్రాళ్లు సత్తా చాటుతూ వచ్చినా... వారితో పోటీ పడుతూ సత్తా చాటిన ఆనంద్ 37 సంవత్సరాలుగా 'టాప్'లోనే నిలిచాడు. ఒక తరం పాటు ఆటను శాసించి ఎందరికో స్ఫూర్తిగా నిలిచిన ఆనంద్ ఇప్పుడు తొలిసారి తన భారత నంబర్‌వన్ స్థానాన్ని కోల్పోయాడు. 17 ఏళ్ల దొమ్మరాజు గుకేశ్ ఇప్పుడు టాప్ ర్యాంక్‌లోకి వచ్చాడు. అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) శుక్రవారం అధికారికంగా ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ప్రకటించింది. ఇందులో గుకేశ్ 8వ ర్యాంక్‌లో నిలవగా... విశ్వనాథన్ ఆనంద్ 9వ ర్యాంక్‌లో ఉన్నాడు. గుకేశ్ రేటింగ్ 2758 కాగా, ఆనంద్ రేటింగ్ 2754గా ఉంది. ఇటీవల జరిగిన వరల్డ్ కప్ సమయంలోనే 'లైవ్ రేటింగ్'లో ఆనంద్‌ను గుకేశ్ అధిగమించాడు. అయితే ఇప్పుడు 'ఫిడే' ర్యాంకింగ్ ద్వారా అధికారికంగా ఆమోద ముద్ర వేసింది. టాప్–30 ర్యాంకింగ్స్‌లో వీరిద్దరితో పాటు భారత్ నుంచి ఆర్. ప్రజ్ఞానంద (19), విదిత్ గుజరాతీ (27), అర్జున్ ఎరిగైశి (29) ఉండగా, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సీనియర్ గ్రాండ్‌మాస్టర్ పెంటేల హరికృష్ణ 31వ స్థానంలో కొనసాగుతున్నాడు. 12 ఏళ్ల 7 నెలల 17 రోజుల గ్రాండ్‌మాస్టర్‌గా మారిన గుకేశ్ అతి పిన్న వయసులో ఈ ఘనత సాధించిన ఆటగాళ్ల జాబితాలో మూడో స్థానంలో ఉన్నాడు.

అల్‌కరాజ్, మెద్వెదెవ్ ముందంజ

- ఓటమితో జాన్ ఇస్నర్ రిటైర్
- యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్

న్యూయార్క్: యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో వరల్డ్ నంబర్‌వన్ కార్లోస్ అల్‌కరాజ్ (స్పెయిన్)కు రెండో రౌండ్‌లో సునాయాస విజయం దక్కింది. ఈ మ్యాచ్‌లో టాప్ సీడ్ అల్‌కరాజ్ 6–3, 6–1, 7–6 (7/4)తో లాయిడ్ హారిస్ (దక్షిణాఫ్రికా)ను ఓడించి మూడో రౌండ్‌లోకి అడుగు పెట్టాడు. మూడో సీడ్ డానిల్ మెద్వెదెవ్ (రష్యా) రెండో రౌండ్‌లో 6–2, 6–2, 6–7 (6/8), 6–2తో క్రిస్టోఫర్ కానెల్ (ఆస్ట్రేలియా)పై విజయం సాధించాడు. మూడు గ్రాండ్‌స్లామ్‌ల విజేత ఆండీ ముర్రే (బ్రిటన్) ఆట మాత్రం రెండో రౌండ్‌లోనే ముగిసింది. గ్రిగర్ దిమిత్రోవ్ (బల్గేరియా) 6–3, 6–4, 6–1తో ముర్రేను ఇంటి ముఖం పట్టించాడు. మహిళల సింగిల్స్‌లో రెండో సీడ్ సబలెంకా (రష్యా) 6–3, 6–2తో జోడీ బురెజ్ (యూకే)ను...9వ సీడ్ వొండ్రుసోవా (చెక్ రిపబ్లిక్) 6–2, 6–2తో ట్రెవిజాన్ (ఇటలీ)ను ఓడించి మూడో రౌండ్‌లోకి ప్రవేశించారు.

టెన్నిస్ సర్క్యూట్‌లో సుదీర్ఘ మ్యాచ్‌లకు చిరునామాగా నిలిచిన జాన్ ఇస్నర్ (అమెరికా) రెండో రౌండ్‌లో మరో సుదీర్ఘ సమరంలో ఓడి ఆటకు రిటైర్మెంట్ ప్రకటించాడు. 3 గంటల 57 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో అమెరికాకే చెందిన



కుమారుడితో ఇస్నర్

మైకేల్ మో 3–6, 4–6, 7–6 (7/3), 6–4, 7–6 (10/7) స్కోరుతో ఇస్నర్‌ను ఓడించాడు. టెన్నిస్ చరిత్రలో సుదీర్ఘ మ్యాచ్ (11 గంటల 5 నిమిషాల పాటు – నికోలస్ మహుత్‌తో) ఆడిన రికార్డులో ఇస్నర్ భాగం కాగా...అత్యధిక ఏస్‌లు (14,470) కొట్టిన ఘనత కూడా అతని సొంతం. **పురుషుల డబుల్స్‌లో ఇద్దరు భారత ఆటగాళ్ల పోరు తొలి రౌండ్‌లోనే ముగిసింది. యూకీ బాంబ్రీ (భారత్) – డెమోలినర్ (బ్రెజిల్) జోడి 3–6, 5–7తో హ్యూగో నిస్ (మొనాకో) – జిలిన్‌స్కీ (పోలాండ్) చేతిలో... సాకేత్ మైనేని (భారత్) – కరట్‌సెవ్ (రష్యా) ద్వయం 7–6 (7/4), 3–6, 2–6తో లాస్లో జెరె (సెర్బియా) – హ్యూస్టర్ (స్విట్జర్లాండ్) చేతిలో ఓడారు.**